సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 14 । జూలై । 2025



కూటమి అరాచక పాలనపై పోరాడుదాం
మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ 8లో



సముద్ర వాణిజ్యానికి చిరునామా బంగాళాఖాతం 8లో



'కోట'మెచ్చిన విశాఖ 8లో

## • కాలువ కాదు..కాలనీయే..



ఇది నగరంలోని కేఆర్ఎం కాలనీ. ఇళ్ల మధ్యలో ఏర్పడిన కొత్త చెరువా అని సందేహం కలుగుతోంది కదూ మీకు...ఆదివారం కురిసిన వర్షానికి సిటీ డొల్లతనం బయటపడింది. వర్షపు నీరు ఏకంగా రోడ్లపై నిలిచిపోయి, పలు వాహనాలు కొట్టుకుపోయాయి. కాలనీవాసులు రోడ్లపైన కాదు, ఒక చెరువు ఒడ్డున నివసిస్తున్నార న్నట్టు పరిస్థితి నెలకొంది. కాల్వలు, డ్రైనేజీలు ఆక్రమణలకు గురికావడం, వ్యర్థాలను తొలగించడంలో నిర్లక్ష్యం ఇందుకు కారణం. వర్షాకాలం వచ్చిందంటే విశాఖకు తరచుగా తారసపడే ఈ జలగండంపై కూటమి ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదనడానికి ఈ దృశ్యమే నిదర్శనం. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా, అధికారులు మాత్రం 'నగరానికి ఇది కొత్త అందం' అన్నట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు పెదవి విరుస్తున్నారు.

-ఫొటో : సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం

నగరంలో కుమ్మేసిన వర్షం 8లో

## అదే రన్

వైజాగ్ నేవీ మారథాన్ కోసం కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆదివారం మొదటి కౌంట్‌డౌన్ పరుగును విశాఖ సాగరతీరంలో నిర్వహించారు. మారథాన్‌లో పాల్గొనేవారిని ప్రోత్సహించడం, మానసికంగా, శారీరకంగా బలోపేతం చేయడం కోసం నిర్వహించిన ఈ పరుగులో ఔత్సాహికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే వైజాగ్ నేవీ మారథాన్‌లో పాల్గొనడానికి దేశం నలుమూలల నుంచి, విదేశాల నుంచి కూడా రన్నర్లు వస్తుంటారు. ఈ ఏడాది డిసెంబర్ 14న జరగనున్న మారథాన్ కోసం ఇప్పటి నుంచే సన్నాహాలు మొదలయ్యాయి. ఈ సంవత్సరం మారథాన్‌కు 'రెడ్యూస్, రీయూజ్, రిసైకిల్' నినాదం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ప్లాస్టిక్ రహిత మారథాన్‌ను నిర్వహించడమే దీని ముఖ్య లక్ష్యం. ఈ కౌంట్‌డౌన్ పరుగుతో ప్రధాన మారథాన్‌కు అన్ని ఏర్పాట్లు, ప్రచార కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

– విశాఖ స్పోర్ట్స్




మారథాన్‌లో పాల్గొన్న నేవీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు




# కూటమి నేతల చికెన్ వ్యర్థాల వ్యాపారం



ఏపీ31టీఈ 6239 నంబరు గల ఐచర్ వాహనంలో నగరంలోని చికెన్ వ్యర్థాలను అక్రమంగా తరలించి కాకినాడకు తరలిస్తున్నారు. అనకాపల్లిలోని డైట్ కాలేజీ వద్ద అడ్డుకుంటే నేరుగా కూటమి నేతల పేర్లు చెబుతున్నారు.



ఏపీ39సీయూ 9162 నంబరు గల బొలెరో వాహనానిదీ ఇదే పరిస్థితి. ఈ వాహనంలో చికెన్ వ్యర్థాలను అక్రమంగా తీసుకెళుతున్న డ్రైవర్ నేరుగా టీడీపీ కార్పొరేటర్ గంధం శ్రీను పేరు చెబుతున్నారు. ఇది ఆయన వాహనమే. జీవీఎంసీ అధికారి కిషోర్ కూడా సహకరిస్తున్నారని ధైర్యంగా చెబుతున్నారు.

ఇవే కాదు ఏపీ39వీజీ 0302 బొలెరో వాహనంతో పాటు అనేక వాహనాల్లో అక్రమంగా చికెన్ వ్యర్థాలను తరలిస్తున్నారు. జీవీఎంసీ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా నేరుగా అక్రమాలకు కూడా సహకరిస్తున్నారు. ఫలితంగా కలెక్టర్ జోక్యం చేసుకుని చికెన్ వ్యర్థాల అక్రమ తరలింపును అరికట్టి...కాపులుప్పాడకు తరలించాలని చెబుతున్నప్పటికీ అక్రమార్కులు కనీసం పట్టించుకోవడం లేదు. కూటమి పార్టీలకు చెందిన నేతలు సహకరిస్తుండటమే ఇందుకు కారణం. దీంతో చికెన్ వ్యర్థాలను నేరుగా కాకినాడ, రాజమండ్రి, యలమంచిలి, ఎస్.రాయవరం తదితర ప్రాంతాల్లోని చేపల చెరువులకు తరలిస్తున్నారు.



విశాఖ నగరం నుంచి రోజుకు జోన్‌కు రెండు చొప్పున మొత్తం 16 వాహనాల్లో అక్రమంగా చికెన్ వ్యర్థాలను తరలిస్తున్నారు. ఒక్కో వాహనంలోని వ్యర్థాలను విక్రయించడం ద్వారా ఖర్చులు పోను రూ. 10 వేల వరకూ సంపాదిస్తున్నట్టు తెలుస్తోంది. అంటే ప్రతీ రోజూ రూ.1.6 లక్షలను అక్రమంగా ఆర్జిస్తున్నారన్నమాట. అంటే నెలకు రూ. 48 లక్షల మేర కూటమి నేతలు కేవలం చికెన్ వ్యర్థాల తరలింపు ద్వారా జేబులు నింపుకుంటున్నట్టు అర్థమవుతోంది.

– సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

- విశాఖ నుంచి కాకినాడకు తరలింపు
- జోన్‌కు ఒకరి పేరుతో అనధికారికంగా వ్యర్థాల సేకరణ
- అడ్డువస్తే దాడులు చేస్తామని హెచ్చరికలు
- కలెక్టర్ హెచ్చరించినా ఆగని అక్రమాలు
- నేరుగా టీడీపీ కార్పొరేటర్ గంధం శ్రీను పేరు వెల్లడి
- సహకరిస్తున్న జీవీఎంసీ అధికారులు

వాస్తవానికి జీవీఎంసీ పరిధిలోని 8 జోన్లల్లో... జోన్‌కు ఒకరు చొప్పున చికెన్ వ్యర్థాల తరలింపు కాంట్రాక్టును అప్పగించారు. అయితే కాంట్రాక్టర్లు అక్రమాలకు పాల్పడుతున్న వైనంపై 'సాక్షి'లో వరుస కథనాలకు స్పందించిన కలెక్టర్ సదరు కాంట్రాక్టును రద్దు చేశారు. తిరిగి కోర్టు ఆదేశాలతో కాంట్రాక్టర్లు పనికానిస్తున్నారు. కాంట్రాక్టర్లతో పాటు జోన్‌కు ఒకరు చొప్పున కూటమి నేతలు అనధికారికంగా చికెన్ వ్యర్థాల సేకరణను ప్రారంభించారు. ఆయా జోన్లల్లో అనధికారికంగా చికెన్ వ్యర్థాలను సేకరిస్తున్నారు. అయితే ఈ వ్యర్థాల సేకరణను కాంట్రాక్టు పొందిన వ్యక్తులు అడ్డుకోకుండా రౌడీషీటర్లతో పహారా కాయిస్తూ మరీ వ్యర్థాల సేకరణ చేపడుతుండటం గమనార్హం. ఒక్కో ప్రాంతానికి ఒక్కో రౌడీషీటరు ఈ చికెన్ వ్యర్థాల సేకరణ బాధ్యతలు చూస్తున్నారు. వీరికి ప్రధానంగా కూటమి పార్టీల్లోని ముఖ్యమైన నేతల అండదండలుండటమే ఇందుకు కారణం. ఒక్కో జోన్‌కు ఒక్కో కూటమి నేత అండదండలు అందిస్తున్నారు. ఏకంగా ఒక జిల్లా స్థాయి నేత పోలీసుస్టేషన్‌కు వెళ్లి మరీ కేసులు పెట్టాలంటూ ఒత్తిళ్లు తేవడం చర్చనీయాంశమయ్యింది. అంతేకాకుండా అటు జనసేన ఎమ్మెల్యే, ఇటు టీడీపీ మాజీ ఎమ్మెల్యే, కార్పొరేషన్‌లోని కీలక నేత ఒకరు అండదండలతో ఈ వ్యవహారమంతా సాగుతోంది. మొన్నటివరకు డిప్యూటీ మేయర్ పోస్టు ఆశించిన గంధం శ్రీను పేరు ఇప్పుడు ఏకంగా వ్యర్థాలను తరలిస్తున్న డ్రైవర్ పేర్కొనడం గమనార్హం. మొత్తంగా కూటమి నేతల అండదండలతో రౌడీషీటర్ల పహారాలతో చికెన్ వ్యర్థాల తరలింపు వ్యవహారం భారీగా సాగుతోంది. ఇందుకు కలెక్టర్ ఆదేశాలు కూడా బుట్టదాఖలవుతుండటమే అసలైన వైచిత్రి!

### ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా ద్వారా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతు న్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యర్థాలను అక్రమంగా సేకరిస్తున్న ముఠాలు వాటిని అధిక ధరలకు చేపలు, రొయ్యల చెరువుల యజమానులకు విక్రయిస్తున్నాయి. ఈ వ్యర్థాలను ఆహారంగా తీసుకున్న చేపలు, రొయ్యలు త్వరగా బరువు పెరుగుతుండడంతో, మేత ఖర్చు తగ్గించుకోవడానికి చెరువుల యజమానులు ఈ అక్రమాలకు పాల్పడు తున్నారు. ఈ వ్యవహారం నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నప్పటికీ, జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం, మత్స్యశాఖ, పోలీసు శాఖ అధికారులు ఎవరూ దీనిపై దృష్టి పెట్టడం లేదు. పైగా, అక్రమ రవాణాకు పాల్పడుతున్నవారు తమకు జీవీఎంసీకి చెందిన అధికారి కిషోర్ సహకరిస్తున్నారని నిస్సంకోచంగా చెబుతుండడం గమనార్హం. అయితే తన పేరును ఎవరో కావాలని చెబుతున్నారని జీవీఎంసీ వెటర్నరీ అధికారి కిషోర్ ఈ ఆరోపణలను ఖండించారు. అంతేకాకుండా, చికెన్ వ్యర్థాలు కాపులుప్పాడలోని నిర్ణీత ప్రాంతానికి చేరాయా లేదా అని పరిశీలించాల్సిన అధికారులు కూడా ఈ అక్రమాలకు భాగస్వాములవుతూ తప్పుడు నివేదికలను సమర్పిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కలెక్టర్ స్వయంగా జారీ చేసిన ఆదేశాలను కూడా లెక్క చేయకుండా, కూటమి నేతల అండదండలతో అధికారులు ఈ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. ఈ వ్యర్థాలను ఆహారంగా తీసుకున్న చేపలు, రొయ్యలను మనం తినడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కాలేయ, జీర్ణకోశ, నాడీ సంబంధిత సమస్యలు, మహిళల్లో నెలసరి సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం కూడా ఉంది.

# ఖాళీ భూములతో కాసుల పంట

- భీమిలి, లంకెలపాలెంలోని ఖాళీ భూముల అభివృద్ధి
- పీపీపీ పద్ధతిలో అభివృద్ధికి వీపీటీ టెండర్ల ఆహ్వానం
- ఔషధవనం, మియావాకీ ఫారెస్ట్, రాక్ గార్డెన్‌ల ఏర్పాటు
- మొత్తం 594.98 ఎకరాల్లో టూరిజం ప్రాజెక్టుల ఏర్పాటు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఖాళీ స్థలాల్లో కమర్షియల్ వ్యవహారాలను చేపట్టడం ద్వారా కాసుల పంట పండించుకునేందుకు విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ (వీపీటీ) సిద్ధమవుతోంది. ఖాళీగా ఉన్న సుమారు 600 ఎకరాల విస్తీర్ణంలో సోలార్ క్రూజ్, సోలార్ సైకిల్ ట్రాక్ వంటివి అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. అంతేకాకుండా రాక్ గార్డెన్, బ్యాక్ వాటర్‌లో వాటర్ జార్బింగ్, మియావాకీ ఫారెస్ట్ వంటివి ఏర్పాటు చేయడం ద్వారా నగరవాసులు సేదతీరేందుకు సరైన చోటు ఉండేలనేది వీపీటీ ఆలోచనగా ఉంది. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో ఈ ఖాళీ స్థలాలను అభివృద్ధి చేయాలని వీపీటీ నిర్ణయించింది. ఇందుకోసం ఇప్పటికే ఆసక్తి వ్యక్తీకరణ దరఖాస్తుల (ఈవోఐ)ను ఆహ్వానించింది. త్వరలో టెండర్లను ఖరారు చేసి అటు భీమిలి, ఇటు లంకెలపాలెంలో ఉన్న 594.98 ఎకరాలను అభివృద్ధి చేసేందుకు సిద్ధమవుతోంది.

### సోలార్ సైక్లింగ్.. ట్రెకింగ్!



లంకెపాలెం వద్ద 306.86 ఎకరాల ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలం ప్రధానంగా కొండలు, అటవీ ప్రాంతంతో నిండి ఉంది. ఈ ప్రాంతంలో కొండ చుట్టూ సోలార్ సైక్లింగ్‌తో పాటు ట్రెక్కింగ్ సదుపాయాలను కల్పించాలని భావిస్తున్నారు. రోప్ ద్వారా ట్రెక్కింగ్‌కు ఏర్పాట్లు చేయడం ద్వారా ఈ ప్రాంతం పర్యాటకులను ఆకర్షిస్తుంది. ఇక, ఇక్కడ అటవీ ప్రాంతం ఉండటంతో ఔషధ వనంతో పాటు మియావాకీ ఫారెస్ట్‌ను అభివృద్ధి చేయాలనేది మరో ఆలోచన. అంతేకాకుండా, రాక్ గార్డెన్ ఏర్పాటుకు కూడా అవకాశం ఉందని గుర్తించారు. అదేవిధంగా, ప్రత్యేకంగా యువత కోసం అడ్వెంచర్, ఫిట్‌నెస్ జోన్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో కూడా సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అవకాశం ఉందని గుర్తించారు. మొత్తంగా, ఇప్పటివరకు ఖాళీగా ఉన్న విశాఖ పోర్టు భూముల్లో పర్యాటక, వాణిజ్య కార్యకలాపాలను నిర్వహించడం ద్వారా కాసుల పంట పండించుకోవాలని యాజమాన్యం సిద్ధమవుతోంది.

### బ్యాక్ వాటర్.. మడ అడవుల అభివృద్ధి!



విశాఖపట్నం పోర్టు ట్రస్టుకు నదిని ఆనుకుని భీమిలి నియోజకవర్గంలోని మూలకుద్దు వద్ద 288.12 ఎకరాల ఖాళీ స్థలం ఉంది. ఈ ప్రాంతంలో బ్యాక్ వాటర్ ఉండడం వల్ల ఇక్కడ మడ అడవులను అభివృద్ధి చేయడంతో పాటు కొన్ని ఆక్వా స్పోర్ట్స్ ఏర్పాటు చేసే అవకాశం ఉందని వీపీటీ భావిస్తోంది. మడ అడవులను అభివృద్ధి చేయడంతో పాటు అక్కడ నడిచేందుకు వీలుగా ఒక వాకింగ్ ట్రాక్ కూడా ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా, బ్యాక్ వాటర్‌లో సోలార్ క్రూజ్‌తో పాటు వాటర్ జార్బింగ్ వంటి ఆక్వా స్పోర్ట్స్ ఏర్పాటు చేయడం వల్ల పర్యాటకులను విశేషంగా ఆకట్టుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు, బటర్‌ఫ్లై పార్కుతో పాటు సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు కూడా అవకాశం ఉందని పోర్టు అధికారులు పేర్కొంటున్నారు. అదేవిధంగా, మ్యూజికల్ ఫౌంటెన్‌తో పాటు పిల్లలు ఆడుకునేందుకు ఒక ప్లే జోన్ కూడా అభివృద్ధి చేయాలని యోచిస్తున్నారు.

# బిల్లులు, వేతనాలు అందకే అసంతృప్తి

- మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తాం
- జెడ్పీటీసీల సమస్యల పరిష్కారానికి కృషి
- మీడియాతో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



మహారాణిపేట: జిల్లా పరిషత్ జనరల్ ఫండ్స్ నుంచి గత 12 నెలలుగా అభివృద్ధి పనుల బిల్లులు విడుదల కాకపోవడం, అలాగే జెడ్పీటీసీలకు చాలా నెలల నుంచి గౌరవ వేతనం రాకపోవడం వంటి సమస్యలపై జెడ్పీటీసీలు అసంతృప్తితో ఉన్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె. సుభద్ర తెలిపారు. ఆదివారం సాయంత్రం జెడ్పీ బంగ్లాలో మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ఏడాది నుంచి దాదాపు రూ. 8.5 కోట్ల బిల్లులు సీఎఫ్ఎంఎస్ ద్వారా విడుదల కావాల్సి ఉందని చైర్‌పర్సన్ తెలిపారు. ఈ ఏడాది జూన్ చివరి వరకు పూర్తయిన పనులకు ఎలాంటి బిల్లులు మంజూరు కాలేదన్నారు. ఈ బిల్లులు ఎప్పుడు మంజూరవుతాయో తెలియని పరిస్థితి ఉండడంతో సభ్యులు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. జెడ్పీటీసీల గౌరవ వేతనం కూడా పెండింగ్‌లో ఉండటం అసంతృప్తికి మరో ప్రధాన కారణమని వివరించారు.

### అపోహలు తొలగాయి..

జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులందరూ కలిసి చర్చించుకున్నామని, తమలో ఎలాంటి అసంతృప్తులు లేవని జె. సుభద్ర స్పష్టం చేశారు. వారంతా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోనే పని చేసేందుకు ఎంతో ఉత్సాహంగా ఉన్నామన్నారు. సమన్వయ లోపం వల్ల చిన్నపాటి సమస్యలు ఉత్పన్నమైనా, వాటిని చర్చల ద్వారా పరిష్కరించుకుంటామన్నారు. ఈ సమస్యల గురించి పార్టీ నాయకులకు అన్ని విషయాలను కూలంకషంగా వివరించినట్లు తెలిపారు. శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఇతర నాయకులు ఈ విషయాన్ని పార్టీ అధినాయకత్వం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని సుభద్ర పేర్కొన్నారు. ఈ సమస్య రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఉందని జెడ్పీటీసీలకు వివరించడంతో వారిలో ఉన్న అపోహలు తొలగాయని ఆమె చెప్పారు. పార్టీ సూచనల మేరకు శాసన మండలి ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యనారాయణ, ఇతర సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ప్రతి జెడ్పీటీసీతో వ్యక్తిగతంగా మాట్లాడినట్లు తెలిపారు. ఈ సమావేశం అనంతరం పూర్తి సహకారం అందిస్తామని జెడ్పీటీసీలు హామీ ఇచ్చినట్లు సుభద్ర పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న విషయాలను కలెక్టర్ హరేందిర ప్రసాద్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు.



## ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్

నగరంలో ఆదివారం ది ఒలింపిక్ సంఘం, విశాఖ శాఖ ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్ ఘనంగా జరిగింది. విశాఖ సాగరతీరంలోని అక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి చిల్డ్రన్ పార్క్ వరకు క్రీడాకారులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఈ పరుగులో ఉత్సాహంగా పాల్గొన్నారు. వాస్తవానికి అంతర్జాతీయ ఒలింపిక్ డే అయిన జూన్ 23న ఈ రన్ నిర్వహించాల్సి ఉండగా, వర్షం కారణంగా అప్పట్లో వాయిదా పడింది. రన్ అనంతరం జరిగిన కార్యక్రమంలో సంఘం చీఫ్ పాట్రన్ పీవీజీఆర్ నాయుడు, ఉపాధ్యక్షుడు ఎస్.విజయ్‌కుమార్ పాల్గొని ప్రతిభ చూపిన క్రీడాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ది ఒలింపిక్ సంఘం, విశాఖ ప్రతినిధులు, పలు క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. - విశాఖ స్పోర్ట్స్



విశాఖ బీచ్‌రోడ్డులో ఒలింపిక్ రన్‌లో పాల్గొన్న క్రీడాకారులు



క్రీడాకారుల విన్యాసాలు

## 1100 సేవలను వినియోగించుకోండి

మహారాణిపేట: కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ జిల్లా ప్రజలకు సూచించారు. అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన తాజా సమాచారం కోసం 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి https://meekosam.ap.gov.inను వినియోగించుకోవాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## చెస్ పోటీల విజేతలు భవన్, శ్రావ్యశ్రీ



శివసాయి దివ్యతో తలపడుతున్న శ్రావ్యశ్రీ

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి అండర్–15 చదరంగం చాంపియన్‌షిప్‌ను కె.భవన్ (ఓపెన్ విభాగం), శ్రావ్యశ్రీ (బాలికల విభాగం) కైవసం చేసుకున్నారు. ఆల్ విశాఖ చెస్ సంఘం ఆధ్వర్యంలో బీవీకే కళాశాలలో ఆదివారం ఈ పోటీలు జరిగాయి. ఓపెన్ విభాగంలో 200 మంది బాలురు, బాలికల విభాగంలో 99 మంది ఏడేసి రౌండ్ల పాటు జరిగిన ఈ పోటీల్లో తలపడ్డారు. ఓపెన్ విభాగంలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన భవన్ ఆరున్నర పాయింట్లతో విజేతగా నిలిచాడు. హర్ష కీర్తన, వినీల్ కార్తీక్, టి.నిశ్చల్ ఆరేసి పాయింట్లతో పోటీ ముగించారు. బాలికల విభాగంలో అనకాపల్లి జిల్లాకు చెందిన శ్రావ్యశ్రీ ఆరున్నర పాయింట్లతో విజేతగా నిలిచింది. శివసాయి దివ్య, ఆఫ్షీన్, గురువర్షిణి ఆరేసి పాయింట్లతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఆయా కేటగిరీల్లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. వీరంతా నవంబర్ 2వ తేదీ నుంచి ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ అండర్–15 చదరంగం చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

## 'కుబేర' పైరసీ ప్రదర్శనపై ఫిర్యాదు



తిరుమల విద్యా సంస్థలు, తాతా థియేటర్ ప్రతినిధులతో మాట్లాడుతున్న పోలీసులు

తగరపువలస: తాళ్లవలస తిరుమల విద్యాసంస్థల యాజమాన్యం చిట్టివలస క్యాంపస్ విద్యార్థుల కోసం ఆదివారం సాయంత్రం 'కుబేర' సినిమాను ప్రదర్శించింది. ప్రస్తుతం ఈ చిత్రం తగరపువలసలోని తాతా థియేటర్‌లో ప్రదర్శించబడుతోంది. ఓటీటీలోకి ఇంకా విడుదల కాని ఈ సినిమాను క్యాంపస్ బయట, రోడ్డుపైనే రెండు స్క్రీన్లను ఏర్పాటు చేసి ప్రదర్శించడంపై థియేటర్ యాజమాని పరిమి గోపి తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. తిరుమల యాజమాన్యం పైరసీకి పాల్పడిందని ఆరోపిస్తూ.. తమ సిబ్బందిని పంపి సినిమా ప్రదర్శనను నిలిపివేయించారు. అనంతరం ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు క్యాంపస్‌కు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన రెండు ప్రొజెక్టర్లు, రెండు స్క్రీన్లు, అలాగే పెన్‌డ్రైవ్‌లను స్వాధీనం చేసుకున్నారు.

## భూసేకరణపై 3 రోజుల శిక్షణకు జేసీ

మహారాణిపేట: జేసీ మయూర్ అశోక్ ముస్సోరీలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో మూడు రోజుల పాటు ఇన్–సర్వీస్ శిక్షణ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈ మేరకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం భూసేకరణ అంశంపై ఈ శిక్షణ జరగనుంది. జేసీతో పాటు మరో ఇద్దరు ఐఏఎస్ అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. కాగా.. జేసీ బాధ్యతలను కలెక్టర్ పర్యవేక్షించాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

# రోడ్డెక్కిన జిమ్నాస్ట్‌లు

ఒక వైపు క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలంటూ ఒలింపిక్ డే రన్ పేరుతో అట్టహాసంగా కార్యక్రమం జరుగుతోంది. మరోవైపు యువ క్రీడాకారులు తమకు ప్రాక్టీస్ చేసుకునేందుకు ఉన్న చోటును కాపాడమంటూ ప్లకార్డులతో నిరసన తెలుపుతున్నారు. క్రీడాభివృద్ధికి పాటుపడాల్సిన పెద్దలు వారి ఆవేదనను పట్టించుకోకుండా నవ్వుతూ ర్యాలీలో ముందుకు సాగుతున్నారు. ఈ చిత్రం విశాఖ క్రీడారంగంలో నెలకొన్న దయనీయ పరిస్థితులకు అద్దం పడుతోంది.



జిమ్నాస్ట్‌లు నిరసన తెలుపుతుండగా.. నవ్వుతూ ముందుకు సాగిపోతున్న ది ఒలింపిక్ సంఘం ప్రతినిధులు

- ఒలింపిక్ రన్ వేళ ప్లకార్డులతో నిరసన
- సాధన చేసుకునే హాలును ఇతరులకు ఇవ్వొద్దని నినాదాలు
- కలెక్టర్ స్పందించాలని వినతి

విశాఖ స్పోర్ట్స్: ఆదివారం బీచ్ రోడ్డులో జరిగిన ఒలింపిక్ డే రన్.. జిమ్నాస్ట్‌లు, వారి తల్లిదండ్రుల నిరసనలకు వేదికైంది. పాండురంగాపురంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) హాలులో కొన్నేళ్లుగా సాధన చేస్తూ.. పతకాలు సాధిస్తున్న జిమ్నాస్ట్‌లను అక్కడి నుంచి ఖాళీ చేయించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. వారి స్థానంలో వెటరన్ క్రీడాకారులకు బ్యాడ్మింటన్ ఆడుకోవడానికి ఆ ప్రాంగణాన్ని కేటాయించాలనే ప్రతిపాదన ఈ ఆందోళనకు కారణమైంది. తమకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని నిరసిస్తూ.. చిన్నారులు ఒలింపిక్ డే రన్ నిర్వహిస్తున్న పెద్దల ఎదుటే ప్లకార్డులు ప్రదర్శించారు. 'మా హాలును మాకే ఇవ్వండి'.. కలెక్టర్ గారూ స్పందించండి అంటూ నినాదాలు చేశారు. అయితే జిల్లా ఒలింపిక్ సంఘానికి పెద్దగా వ్యవహరిస్తూ.. స్థానిక ప్రజాప్రతినిధిగా ఉన్న నాయకుడు ఈ నిరసనను చూసీ చూడనట్టు ముందుకు సాగడం విమర్శలకు తావిస్తోంది. క్రీడలను బతికిస్తున్నామని చెప్పుకునే నాయకుల కళ్ల ముందే క్రీడాకారులు రోడ్డెక్కడంతో.. ఇంతకంటే దారుణం ఏముంటుందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

**దిగజారుతున్న పరిస్థితులు**

వాస్తవానికి విశాఖలో క్రీడల పరిస్థితి దయనీయంగా మారింది. టోర్నమెంట్లు నిర్వహించడం, సర్టిఫికెట్లు పంచుకోవడం, సత్కారాలు చేసుకోవడంపై ఉన్న శ్రద్ధ.. క్షేత్రస్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించడంపై లేదన్నది బహిరంగ రహస్యం. జిల్లా నుంచి ఎంత మంది జాతీయ స్థాయి క్రీడాకారులు ఉన్నారో కూడా జిల్లా క్రీడాసంస్థ వద్ద వివరాలు లేకపోవడం ఇక్కడి నిర్లక్ష్యానికి నిలువుటద్దం. ఒలింపిక్ పతకాలు సాధించడం మాట అటుంచి.. ఆ స్థాయికి చేరుకోవడానికి అవసరమైన ప్రాథమిక మౌలిక సదుపాయాలు, దీర్ఘకాలిక ప్రణాళికలు కొరవడ్డాయి. ఒలింపిక్ స్థాయికి స్వశక్తితో వెళ్లిన స్థానిక అథ్లెట్ జ్యోతి సైతం స్థానికంగా ప్రోత్సాహం లేదని ఇటీవల ఆవేదన వ్యక్తం చేయడం ఇక్కడి వాస్తవ పరిస్థితిని తెలియజేస్తుంది. ఇక జిల్లా ఒలింపిక్ సంఘం కేవలం రన్‌లు నిర్వహించి, తమకు నచ్చిన వారికి సత్కారాలు చేసుకోవడానికే పరిమితమైంది. క్రీడా సంఘాల కోసం ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది.

**జిమ్నాస్ట్‌లకు మద్దతు ఇవ్వండి**

ఒకప్పుడు డీఎస్ఏ కార్యాలయం ఉన్న స్థలం చేజారిపోయి, ప్రస్తుతం ఒక హాలు మాత్రమే మిగిలింది. ఇక్కడ కొన్నేళ్లుగా చిన్నారులు జిమ్నాస్ట్‌లు ప్రాక్టీస్ చేసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పతకాలు సాధిస్తున్న జిమ్నాస్ట్‌లకు అండగా నిలవాల్సింది పోయి.. వారి సాధనకే ఆటంకం కలిగించడం పట్ల క్రీడాభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన ఈ జిమ్నాస్ట్‌లు.. తమకు న్యాయం జరిగే వరకు పోరాడతామని చెబుతున్నారు. ఒలింపిక్స్‌లో పతకాల గురించి ప్రగల్భాలు పలికే ముందు.. ఉన్న క్రీడాకారులకు కనీస సౌకర్యాలు కల్పించడంపై అధికారులు దృష్టి సారించాలని క్రీడాభిమానులు కోరుతున్నారు.



బీచ్‌రోడ్డులో నిరసన వ్యక్తం చేస్తున్న జిమ్నాస్ట్‌లు, తల్లిదండ్రులు

# 'కోట'మెచ్చిన విశాఖ

- విలన్‌గా ప్రస్థానం ఇక్కడ నుంచే మొదలు
- బీచ్ అంటే చాలా ఇష్టం
- విశాఖ ఉమ్మడి జిల్లాలో ఎన్నో చిత్రాల షూటింగ్



విశాఖలో జరిగిన 'హెచ్చరిక' షూటింగ్‌లో కోట శ్రీనివాసరావు(ఫైల్)

కొమ్మాది: తెలుగు సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన మహానటుడు కోట శ్రీనివాసరావు. విలన్‌గా, విలక్షణ నటుడిగా, తండ్రిగా, రాజకీయ నాయకుడిగా, కామెడీ విలన్‌గా యావత్ తెలుగు ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న కోటకు విశాఖతో విడదీయరాని అనుబంధం ఉంది. ప్రతిఘటన సినిమాతో విలన్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన కోట శ్రీనివాసరావు.. విశాఖలో చిత్రీకరించిన ఈ సినిమాతోనే విలన్ పాత్రలకు కొత్త నిర్వచనం ఇచ్చారు. ఆ చిత్రం ఆయన్ని 'విలన్ అంటే కోట శ్రీనివాసరావు' అనే స్థాయికి తీసుకెళ్లింది. అప్పటి నుంచి అనేక సినిమాలు విశాఖలో చిత్రీకరించారు. విశాఖలో ఆయన నటించిన చిత్రాల్లో ప్రతిఘటన, అలీ బాబా అరడజను దొంగలు, జంబలకిడిపంబ, ఆ ఒక్కటి అడక్కు, కర్తవ్యం, దొరబాబు, పోలీస్ బ్రదర్స్, లాఠీ చార్జ్, రాజధాని, ఛత్రపతి, యోగి, బుజ్జిగాడు, గణేష్ వంటివి ఎన్నో ఉన్నాయి.

**విశాఖ అంటే ఎంతో ఇష్టం**

నగరానికి వచ్చినప్పుడు ఆయన ఎక్కువగా దసపల్లా, మేఘాలయ హోటళ్లలో బస చేసేవారని ఆయన సన్నిహితులు తెలిపారు. విశాఖ నగరం అంటే ఆయనకు ఎంతో ఇష్టమని, షూటింగ్ విరామ సమయాల్లో బీచ్‌కు వెళ్లి సేదతీరేవారని సినీ మిత్రులు గుర్తు చేసుకున్నారు. విశాఖ, అరకు ప్రాంతాల్లో ఆయన సినిమాలు షూటింగ్ జరిగాయన్నారు.

**వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సంతాపం**

తాటిచెట్లపాలెం: విలక్షణ నటుడు, సుదీర్ఘకాలం తెలుగు సినీ పరిశ్రమకు సేవలందించి, ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న కోట శ్రీనివాసరావు మృతి పట్ల వైజాగ్ ఫిలిం సొసైటీ సంతాపం వ్యక్తం చేసింది. ఆయన మరణం సినీ పరిశ్రమకు తీరని లోటని సొసైటీ సెక్రటరీ నరవ ప్రకాశరావు, అధ్యక్షుడు కాశీ విశ్వేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి బి.చిన్నారావు అన్నారు.

**తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటు**

తెలుగు సినీ పరిశ్రమ ఓ మహానటుడిని కోల్పోయింది. ఏ పాత్ర వేసినా ఆ పాత్రకు న్యాయం చేసే ఏకైక నటుడు కోట శ్రీనివాసరావు. ఎస్.వి.రంగారావు, కైకాల సత్యనారాయణ, రావు గోపాలరావు వంటి దిగ్గజాల తర్వాత సినీ పరిశ్రమలో అంతటి లోటును తీర్చింది కోట శ్రీనివాసరావే. విశాఖలో సినిమా చిత్రీకరణ అంటే కోట ఎంతో ఉత్సాహంగా వచ్చేవారు. ఆయనతో పలు సినిమాల్లో నటించా. ఆయన లేరన్న వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటు.

– ప్రసన్న కుమార్, సినీ నటుడు, వైజాగ్

## కుమ్మేసిన వాన



వర్షపు నీటితో నిండిన కేఆర్ఎం కాలనీ రోడ్డు



వర్షపు నీటితో నిండిన రైల్వేస్టేషన్

మహారాణిపేట: నగరంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఉన్న తీవ్రమైన ఎండలు, ఉక్కపోత నుంచి ఈ వర్షం నగరవాసులకు ఉపశమనం కలిగించింది. సుమారు గంటపాటు కురిసిన ఈ వర్షం కారణంగా నగరంలోని అనేక పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. చావులమదుం బ్రిడ్జి, రైల్వే స్టేషన్ రోడ్ వంటి చోట్ల వర్షపు నీరు నిలిచిపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సీతమ్మధారలో అత్యధికంగా 34 మిల్లీమీటర్ల వర్షం కురవగా.. విశాఖ రూరల్‌లో 20.50, మేహాద్రిగెడ్డలో 18, కొత్తపాలెంలో 17, జోగవానిపాలెంలో 16, కూర్మన్నపాలెంలో 13.25, మహారాణిపేటలో 10.75, పెదగంట్యాడలో 10.25, గోపాలపట్నంలో 9.5, సాగర్‌నగర్‌లో 8, వడ్లపూడిలో 7.6, గోపాలపట్నంలో 6.0, గాజువాకలో 5.25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది.

## డెలివరీ బాయ్‌పై దాడి

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం పరిధిలో ఆదివారం సాయంత్రం డెలివరీ బాయ్‌పై దాడి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం ఉదయం ఓ డెలివరీ బాయ్ అక్కయ్యపాలెంలోని ఒక ఇంటికి పార్సిల్ డెలివరీ చేయడానికి వెళ్లాడు. ఆ సమయంలో ఇంటివద్ద ఎవరూ లేకపోవడంతో, అతను ఫోన్ చేయగా, సాయంత్రం రావాలని ఇంటి యజమానులు చెప్పారు. సాయంత్రం మళ్లీ ఆ ఇంటికి వెళ్లిన డెలివరీ బాయ్, పార్సిల్ తీసుకునేందుకు కిందకి రమ్మనగా, యజమానులు మాత్రం పైకి వచ్చి డెలివరీ చేయమని కోరారు. డెలివరీ బాయ్ నిరాకరించి, వారినే కిందకి రమ్మనడంతో కోపోద్రిక్తులైన యజమానులు అతనిపై దాడి చేశారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న కొందరు వ్యక్తులు అడ్డుకుని, డెలివరీ బాయ్‌ను అక్కడి నుంచి పంపించివేశారు.

## కూటమి అరాచక పాలనపై పోరాడుదాం



మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, భీమిలి సమన్వయకర్త శ్రీనివాసరావు, పార్లమెంట్ పరిశీలకుడు బాబూరావు, యలమంచిలి సమన్వయకర్త ధర్మశ్రీ, పార్టీ నేతలు

కొమ్మాది : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని, సుపరిపాలన అంటూ డ్రామాలు ఆడుతోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. ఆదివారం ఎండాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చిన్నశ్రీను) ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం, 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం శాంతి భద్రతలను కాపాడే పరిస్థితిలో లేదని, 'రెడ్‌బుక్ రాజ్యాంగం' నడుస్తోందని అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నా ఒక్క సంక్షేమ, అభివృద్ధి పథకం కూడా పూర్తి చేయలేదని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 2 లక్షల కోట్లకు పైగా సంక్షేమానికి ఖర్చు చేసిందని గుర్తు చేశారు. చంద్రబాబు పాలనలో సంక్షేమ పథకాలు లేవని, జగన్ మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి పథకాలను తాము చేసినట్లుగా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం మోసాలను, అక్రమ కేసులు, భూ ఆక్రమణలను ఇంటింటికి వివరించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు, మాటలకు గ్యారెంటీ లేదని, చంద్రబాబు నాయుడు మోసగాడని అన్నారు. కూటమి పాలనలో చోటు చేసుకున్న అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించే బాధ్యత ప్రతి కార్యకర్త, నాయకుడు తీసుకోవాలన్నారు. యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ 14 నెలలకే కూటమి ప్రభుత్వంపై భారీ వ్యతిరేకత వచ్చిందని, చంద్రబాబును ఇంటికి పంపించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను, ప్రస్తుత నిర్లక్ష్యాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్ కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, జెడ్పీటీసీ కోరాడ వెంకట్రావు, ఎంపీపీలు దంతులూరి వాసురాజు, కంటుబోతు రాంబాబు, మజ్జి శారదా ప్రియాంక, కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, 1 నుంచి 8 వార్డుల అధ్యక్షుడు గుడ్లపోలిరెడ్డి, పోతిన శ్రీనివాస్, పోతిన హనుమంతు, పాల రమణారెడ్డి, బొట్టా అప్పలరాజు, జగ్గుపిల్లి ప్రసాద్, భాస్కర్‌రెడ్డి, అల్లిపిల్లి నర్సింగరావు, మండల అధ్యక్షులు బంక సత్యం, గాడు శ్రీను, ముఖ్య నాయకులు దాట్ల పెదబాబు, వంకాయల మారుతీ ప్రసాద్, అక్కరమాని రామానాయుడు, సిల్లా కరుణాకరరెడ్డి, మైలపిల్లి షణ్ముఖరావు, సిరమ్మ, బెందాళం పద్మావతి, ఎలమంచిలి సూర్యనారాయణ, చెన్నాదాస్, పిల్లా సుజాత, ముదుండి రాజేశ్వరి, చేకూరి రజిని, జీరు వెంకటరెడ్డి, జగ్గుపిల్లి నరేష్, మంగరాజు, మజ్జి వెంకట్రావు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# సముద్ర వాణిజ్యానికి చిరునామా.. బంగాళాఖాతం

- నేటి నుంచి బిమ్స్ టెక్ సమ్మిట్
- విశాఖ పోర్టు ఆధ్వర్యంలో నిర్వహణ
- హాజరుకానున్న దక్షిణాసియా దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, పోర్టుల ప్రతినిధులు
- బ్లూ ఎకానమీ, సుస్థిర ఆవిష్కరణ భాగస్వామ్యం థీమ్ తో సదస్సు



కేంద్రమంత్రి శర్బానందకు స్వాగతం పలుకుతున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

సాక్షి, విశాఖపట్నం: భారత దేశానికి వ్యూహాత్మకంగా అత్యంత కీలక ప్రాంతంగా బంగాళాఖాతం రూపాంతరం చెందుతున్న తరుణంలో.. సముద్ర వాణిజ్యానికి చిరునామాగా ఈ అఖాతాన్ని మార్చేందుకు దక్షిణాసియా దేశాలు మరోసారి ఒకే వేదికపైకి రాబోతున్నాయి. అంతర్జాతీయ వ్యాపారానికి, చమురు, ఖనిజ రవాణాకు ప్రత్యేక వాణిజ్య కేంద్రంగానూ, భద్రత పరంగానూ భౌగోళికంగా అభివృద్ధి చెందింది. దక్షిణాసియా దేశాలన్నీ ప్రాంతీయ శక్తిగా ఎదిగేందుకు దౌత్య, వాణిజ్య, పర్యాటకం, సాంకేతికత, జలరవాణా రంగాల్లో ఆధిపత్యాన్ని సాధించేందుకు రెండోసారి విశాఖ వేదికగా బిమ్స్‌టెక్ కాంక్లేవ్ జరగనుంది. బ్లూ ఎకానమీ, సుస్థిర ఆవిష్కరణల భాగస్వామ్యం అనే థీమ్‌తో జరిగే సదస్సులో దక్షిణాసియాకు చెందిన ఏడు దేశాల ప్రతినిధులు హాజరవుతుండగా.. విశాఖపట్నం పోర్టు ఆతిథ్యమివ్వనుంది.

బంగాళాఖాతం తీర ప్రాంత అభివృద్ధి, నౌకాశ్రయ సహకారం, బ్లూ ఎకానమీలో పెట్టుబడులు వంటి అంశాల్లో బిమ్స్‌టెక్ (బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ–సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్) కీలకంగా మారింది. ఈ సహకారాన్ని మరింతగా బలోపేతం చేసుకునేందుకు విశాఖ పట్నం పోర్ట్ అథారిటీ (వీపీఏ) ఆధ్వర్యంలో సోమ,మంగళవారాల్లో నగరంలో బిమ్స్‌టెక్ కాంక్లేవ్–2025 రెండో ఎడిషన్ జరగనుంది. బంగ్లాదేశ్, భూటాన్, భారత్, మయన్మార్, నేపాల్, శ్రీలంక, థాయిలాండ్ దేశాలకు చెందిన సంబంధిత మంత్రిత్వ శాఖల ప్రతినిధులు, పోర్టుల అధికారులు, షిప్పింగ్ నిపుణులు, పారిశ్రామిక ప్రతినిధులు సదస్సులో భాగస్వామ్యం కానున్నారు. బంగాళాఖాతం కేవలం సముద్ర ప్రాంతం మాత్రమే కాదనీ.. ఆసియా – దక్షిణాసియా దేశాల వ్యూహాత్మక సంబంధాల మార్గమని చాటిచెప్పేలా బిమ్స్‌టెక్ నిర్వహిస్తున్నారు.

**గ్రీన్ ఎనర్జీ.. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌పై దృష్టి**

సదస్సులో భాగంగా సభ్య దేశాల్లో ప్రైవేట్ పెట్టుబడులు, మౌలిక వసతుల అభివృద్ధికి సహకారం, మల్టీ మోడల్ ట్రాన్సిట్ కారిడార్ ను వేగవంతం చేయడం, తీరప్రాంత పర్యాటక మార్గాలు, వారసత్వ క్రూయిజ్‌ల అభివృద్ధి, పోర్ట్ మానవ వనరుల పునరుద్ధరణ, నైపుణ్యాభివృద్ధిపై చర్చలు జరగనున్నాయి. ముఖ్యంగా.. అన్ని రంగాల్లోనూ కృత్రిమ మేధ రాజ్యమేలుతున్న నేపథ్యంలో.. గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ద్వారా బ్లూ ఎకానమీని ముందుకు తీసుకెళ్లడం ఎలా అనే అంశాలపై దక్షిణాసియా దేశాలు కీలకంగా చర్చించనున్నాయి. రెండు రోజుల సదస్సు అనంతరం తీర్మానాలతో పాటు వివిధ దేశాల మధ్య వాణిజ్య, పర్యాటక, వ్యూహాత్మక భాగస్వామ్యాల కోసం ఎంవోయూలు జరగనున్నాయి. సదస్సులో సభ్య దేశాల రవాణా, జలరవాణా, పోర్టుల శాఖ మంత్రులు, సంబంధిత మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు, షిప్పింగ్ సంస్థలు, పోర్ట్ ట్రస్టులు, లాజిస్టిక్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు.



# ఉపాధి @ ఐటీఐ

- పారిశ్రామిక వృత్తి విద్య శిక్షణతో మెండుగా ఉపాధి అవకాశాలు
- ఐటీఐల్లో చురుగ్గా ప్రవేశాలు
- పలు ట్రేడుల్లో అభ్యర్థుల చేరిక
- అందుబాటులో మిగులు సీట్లు



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అధ్యాపకుడు

కంచరపాలెం: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)ల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తున్నాయి. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు త్వరగా ఉపాధి పొందే కోర్సుల్లో ఐటీఐ ఒకటి. వీరికి వృత్తి పరమైన ప్రాధాన్యం అధికంగా ఉంటుంది. ప్రధానంగా జిల్లా విద్యార్థులు ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్‌తోపాటు ఐటీఐ చదివేందుకు అధిక ప్రాధాన్యమిస్తారు. వివిధ ట్రేడుల్లో ఐటీఐ కోర్సులు విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులు అప్రెంటీస్ తర్వాత 18 ఏళ్లు నిండాక పరిశ్రమలు, ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు. డాక్‌యార్డ్, ఆర్టీసీ, షిప్‌యార్డ్, రైల్వే, విద్యుత్, రక్షణ శాఖ వంటి వాటిల్లో సైతం ఉద్యోగాలకు ప్రయత్నించవచ్చు. చదువులో ఒత్తిడి ఉండదు. ఆయా పరిశ్రమలు, సంస్థల్లో ఉద్యోగాలు పొందాలంటే విద్యార్థులకు సాంకేతిక రంగంపై స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలి. నైపుణ్యం ఉన్న వారికి తప్పకుండా ఉపాధి లభిస్తుంది. మరోవైపు స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులకు నైపుణ్య అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఉద్యోగం, ఉపాధితోపాటు స్వయం ఉపాధికి సైతం ఈ కోర్సులు ఎంతగానో దోహదపడతాయి.

**22 ట్రేడ్‌ల్లో శిక్షణ:** విశాఖ జిల్లా పరిధిలో నాలుగు ప్రభుత్వ, 31 ప్రైవేట్ ఐటీఐల్లో 3,286 సీట్లు ఉన్నాయి. ఏడాది, రెండేళ్ల వ్యవధి ఉన్న 22 ట్రేడ్ కోర్సులు నిర్వహిస్తున్నారు. కొన్ని ట్రేడ్‌ల్లో 8వ తరగతి విద్యార్హతతో శిక్షణ ఇస్తున్నారు. అభ్యర్థుల సంఖ్యకు తగ్గట్టుగా ప్రభుత్వ ఐటీఐల్లోని పలు ట్రేడ్‌ల్లో సీట్ల సంఖ్య పెరిగితే అధికంగా ఉద్యోగాలు వచ్చే అవకాశాలు మెండుగా ఉంటాయని పలువురు సూచిస్తున్నారు.

**ఏడాది కోర్సులు**

ప్లంబర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(కోపా), కార్పెంటర్, మెకానికల్ డీజిల్, పీపీవో, స్టెనోగ్రఫీ, వెల్డర్.

**రెండేళ్ల కోర్సులు**

ఏవో కెమికల్, డీఎం సివిల్, డీఎం మెకానికల్, ఫిట్టర్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానికల్, మెకనిస్ట్, ఐసీ అండ్ టీఎస్ఎం, టర్నర్, ఆర్ అండ్ ఏసీ మెకానిక్, ఎంఎంటీఎం, పెయింటర్(జి), ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానికల్, ఐఎం కెమికల్, మెషినిస్ట్ మెకానిక్(ఎంఎం).

**15 నుంచి రెండో విడత కౌన్సెలింగ్**

ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయింది. మిగులు సీట్ల కోసం ఈ నెల 15 నుంచి ప్రభుత్వ ఐటీఐల్లో రెండో విడత కౌన్సెలింగ్ జరగనుంది. ఆసక్తి గల విద్యార్థులు ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సమీపంలోని ఐటీఐకు వెళ్లి పలు ట్రేడ్‌ల్లో చేరవచ్చు. జూలై నెలాఖరు తేదీ లోపు ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేస్తారు. ఆగస్టు మొదటి వారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయి.

| సంప్రదించాల్సిన ఐటీఐలు | పాత ఐటీఐ, కంచరపాలెం న్యూ ఐటీఐ, గాజువాక ఐటీఐ, నరవ బాలికల ఐటీ, కంచరపాలెం ఇండస్ట్రియల్ ఏరియా |
| --- | --- |
| ఏడాది కోర్సులు | 7 |
| రెండేళ్ల కోర్సులు | 15 |
| ప్రభుత్వ ఐటీఐల్లో సీట్లు | 1,648 |
| ప్రైవేట్ ఐటీఐల్లో సీట్లు | 1,638 |
| మొత్తం 35 ఐటీఐల్లో సీట్లు | 3,286 |
| వెబ్‌సైట్ | iti.ap.gov.in |

**ఉత్తమ శిక్షణ ఇస్తున్నారు**



పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో పలు ట్రేడ్‌ల్లో శిక్షణ పొందిన అభ్యర్థులు అప్రెంటిస్‌కు ఎంపిక అవుతున్నాం. విద్యార్థుల ఉద్యోగావకాశాలకు ఉత్తమ శిక్షణ అందించడంలో అధ్యాపకులందరూ మంచి తర్ఫీదు ఇస్తున్నారు. శిక్షణ పూర్తయిన వెంటనే ప్లేస్‌మెంట్(ఉపాధి) దొరికేందుకు అధ్యాపకులు కృషి చేస్తున్నారు.

– కె.కమల్, విద్యార్థి, కంచరపాలెం ఐటీఐ

**మంచి నైపుణ్యాలతో ఉపాధి**



ఐటీఐ విద్యార్థులకు అప్రెంటిస్, స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. ఏడాది కోర్సుల్లో కొత్తగా రెండు ట్రేడ్లు చేర్చాం. విద్యార్థులు ఏడాది, రెండేళ్ల కోర్సుల్లో చేరవచ్చు. షెడ్యూల్ మేరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. పారిశ్రామిక శిక్షణతో టెక్నికల్ విద్యకు అధికంగా ప్రాధాన్యం పెరుగుతుంది.

– జె.శ్రీకాంత్ ప్రిన్సిపాల్, కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ (ఓల్డ్)

## ఫుట్‌బాల్ జట్టుకు శిక్షణ తరగతులు ప్రారంభం

తగరపువలస: చిట్టివలస బంతాట మైదానంలో రాష్ట్రస్థాయి అండర్–16 ఫుట్‌బాల్ బాలుర జట్టుకు ఆదివారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ సూచనల మేరకు, అనంతపురానికి చెందిన దాదా ఖలందర్ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అక్కరమాని చిన బాబు, ఉపాధ్యక్షుడు రాజారావు, కోల చంద్రశేఖర్ 10 రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. శిక్షణ అనంతరం జట్టు ఈ నెల 26న మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్‌లో జరిగే ఆల్ ఇండియా అండర్–16 టోర్నమెంట్‌లో పాల్గొననుంది.

## కిడ్నీ అమ్మకానికి వచ్చిన వ్యక్తిని అడ్డుకున్న పోలీసులు

తాటిచెట్లపాలెం : ఆర్థిక సమస్యల కారణంగా కిడ్నీని అమ్ముకోవడానికి ఏలూరు నుంచి నగరానికి వచ్చిన ఒక వ్యక్తి ప్రయత్నాన్ని ఫోర్త్ టౌన్ పోలీసులు అడ్డుకుని, విచారణ జరిపారు. గత నెల 30న అక్కయ్యపాలెం హైవే సమీపంలో ఉన్న ఒక హోటల్‌లో ఇద్దరు వ్యక్తులు కిడ్నీ అమ్మకం గురించి మాట్లాడుకుంటున్నారని హోటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి, ఆ ఇద్దరినీ స్టేషన్‌కు తరలించి విచారించారు. విచారణలో వారిద్దరూ ఏలూరుకు చెందిన రంగబాబు, యేసురాజుగా గుర్తించారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల కిడ్నీని అమ్ముకోవాలని రంగబాబు తన స్నేహితుడైన యేసురాజుకు చెప్పినట్లు విచారణలో వెల్లడైంది. పోలీసులు మరింత లోతుగా విచారించగా, వీరు కిడ్నీ అమ్మకం కోసం ఎవరినీ సంప్రదించలేదని, ఎలాంటి దళారులను కలుసుకోలేదని తేలింది. ఈ విషయంలో ఎలాంటి అనుమానాలు లేవని నిర్ధారించుకున్న పోలీసులు వారిని సొంత ఊరికి పంపించారు. ఈ విషయమై విచారణ ఇంకా కొనసాగుతోందన్నారు.